శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## 12 కోట్లతో రైల్వే వ్యాగిన్ల మరమ్మతుల సెంటర్ ఏర్పాటు

**బిట్రగుంట, నవంబరు 19 ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని విజయవాడ-గూడూరు రైల్వే మార్గాల మధ్య బిట్రగుంటలో సుమారు 12 కోట్ల రూపాయలతో రైల్వే వ్యాగిన్ల మరమ్మతుల సెంటర్‌ని ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే అధికారులు ధృవీకరించారు. ప్రస్తుతం బిట్రగుంటలో వున్న సిటిఎక్స్ఆర్ డిపోకు అనుసంధానంగా 12 కోట్ల వ్యయంతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. విజయవాడ-గూడూరు రైల్వే రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ, దిగువ మార్గంలో గూడ్సు వ్యాగిన్లు, రైలు బోగీలు మరమ్మతులకు గురైతే అల్లూరు రోడ్డు నుండి బిట్రగుంట వరకు, శ్రీ వెంకటేశ్వరపాళెం నుండి బిట్రగుంట వరకు 12 కోట్ల రూపాయలతో రైల్వే లూప్ లైన్లను నిర్మించనున్నారు. అందులో భాగంగా గత రెండు రోజుల క్రితం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఆదేశాల మేరకు విజయవాడ డివిజనల్ సీనియర్ ఉన్నతాధికారుల బృందం బిట్రగుంటకు విచ్చేసి ఈ మార్గాలను ఏర్పాటు చేసే ప్రక్రియల్ని పరిశీలించారు. గతంలో బిట్రగుంటలో గూడ్సు వ్యాగిన్లు అన్నింటిని తనిఖీ చేసిన అనంతరం ఎగువ, దిగువ మార్గాలలో వెళ్లేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే వారు. అయితే పొదుపు చర్యల్లో భాగంగా ఆ విధానానికి తిలోదాకాలు ఇచ్చి ఇక్కడ వున్న సిటిఎక్స్ఆర్ డిపార్ట్‌మెంట్‌లోని సిబ్బందిని నామమాత్రం చేశారు. ఇటీవల జరిగిన రైలు ప్రమాదాలు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పాటు మానవతప్పిదం కాకుండా ఎక్కువగా సాంకేతిక తప్పిదాల వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని రైల్వే శాఖకు నివేదిక అందింది. దీంతో అత్యవసరమని భావించిన రైల్వే శాఖ బిట్రగుంట ఎగువ, దిగువ మార్గాలలో వీటిని ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతుందని రైల్వే వర్గాలు ధృవీకరించాయి.

**తమ ప్రతిపాదనల వల్లే బిట్రగుంటలో రైల్వే వ్యాగిన్ల మరమ్మతుల సెంటర్ ఏర్పాటు:** ఆదాల విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంటలో వందలాది ఎకరాలు రైల్వే పరంగా నిరుపయోగంగా వున్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని, ఏదైనా యూనిట్‌ని లేదా డిపోలు ఏర్పాటు చేస్తే రైల్వే శాఖకు తక్కువ ఖర్చుతో ఆదా అవుతుందని పలుమార్లు లోక్‌సభలో, స్వయంగా రైల్వే శాఖ మంత్రికి వినతి పత్రాలు అందజేసినందువల్లే 12 కోట్లతో వ్యాగిన్ల మరమ్మతుల సెంటర్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన 'ప్రభాతవార్త'తో ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడ 12 కోట్లతో వ్యాగిన్ల మరమ్మతుల సెంటర్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు జనరల్ మేనేజర్ నుండి తనకు సమాచారం అందిందన్నారు.ఎన్నో కోట్ల రూపాయలు విలువ చేసే నిరుపయోగంగా వున్న రైల్వే స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని పదేపదే కోరగా ఇక్కడ అభివృద్ధి చేసేందుకు పలు రకాల ప్రతిపాదనలను రైల్వే శాఖ పరిశీలిస్తుందన్నారు. పూర్తి స్థాయిలో బిట్రగుంటకు రైల్వే పరంగా పూర్వవైభవాన్ని తెచ్చేందుకు తనతో పాటు తన సహచార రాజ్యసభ సభ్యులు కూడా కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. బిట్రగుంటలో 144 ఎల్‌సి గేటు స్థానంలో ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరలో చేపడతారన్నారు. గతిశక్తి పథకం కింద దీన్ని ఏర్పాటు జరుగుతుందని ఈ ఏడాది డిసెంబరు నాటికి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కానున్నట్లు ఆయన తెలిపారు.

## వైభవంగా కోటి సోమవారం పూజలు



**కోవూరు, నవంబరు 19 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే కోటి సోమవారం పర్వదినం సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.నర్మదా నది నుంచి తీసుకొచ్చిన 11 వేల నర్మద బాల లింగాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తల మండలి సభ్యులు పి. మోహన్, హనుమారెడ్డి, రుత్వికులు శేఖర్‌స్వామి, మురళీస్వామి, వంశీస్వామి, సుబ్బయ్య స్వామి తదితరులు ఉన్నారు.

## కార్తీక దీపంతో ఈశ్వరానుగ్రహం
### రాజరాజేశ్వరనాందస్వామి



**సంగం నవంబర్ 19 ప్రభాతవార్త** సంగం తిరమనకొండపైన కొలువైవున్న శ్రీరాజరాజేశ్వరీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి సన్నిధిలో వైభవంగా యజ్ఞం 37 వ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా పీఠాదిపతులు రాజరాజేశ్వరనాంద స్వామిజీ భక్తులనుద్దేశించి మాట్లాడుతు పార్వతీ పరమేశర్లు బ్రహ్మవిష్ణువులను సృష్టించారు.పంచాభూతల వలన సృష్టిలో 84 లక్షల జీవరాశుల ఉత్పత్తి జరుగుతోంది. జీవరాశులను పరిపాలించేందుకు నవగ్రహాలను సృష్టించారు. ప్రతి జీవి పూర్వ జన్మ సుకృతాలను ఆగొమి సంచిత ప్రారబ్ధముల ద్వారా సుఖదుఖాలు అను భవిస్తున్నాయని అన్నారు.కృత్తికా నక్షత్రం వలన కార్తీకమాసంలో చంద్రుడు అగ్ని తత్త్వంలో ఉంటారు.సకల దేవతలు అగ్నిరూపంలో ఉంటారని స్వామి వివరించారు. భక్తులు సమస్యలు యజ్ఞం దగ్గర కూర్చొని చెప్పుకుంటే కోర్కెలు నెరవేరుతాయని అన్నారు.కనీసం దీపం వెలిగించి ఈశ్వరానుగ్రహం పొందవచ్చునని వివరించారు. కోటి సోమవారం ఎంతో విశిష్టమైనదని ఈరోజు భక్తితో శివ,కేశవులను పూజిస్తే ఎంతో మంచి జరుగుతుందని వివరించారు.ఈకార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గోన్నారు.

## ఆరు మంది పేకాటరాయుళ్లు అరెస్ట్...8450 నగదు పట్టివేత

**కావలి, నవంబరు 19 ప్రభాతవార్త** కావలి పట్టణం మున్సిపాల్టీ పరిధిలోని ముసునూరు ఇందిరమ్మ కాలనీ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై కావలి రూరల్ ఎస్ఐ సుమన్ పోలీస్ సిబ్బందితో ఆదివారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఆరు మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద వున్న 8 వేల 450 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు

## పోలేరమ్మ తల్లి సేవలో చెంచలబాబుయాదవ్



**సీతారామపురం నవంబర్ 19 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని పోకలవారిపల్లి గ్రామం నందు ఈనెల 16 వ తేది నుండి నిర్వహిస్తున్న పోలేరమ్మ సహిత పోతురాజు విగ్రహాప్రతిష్టా ఉత్సవాలలో భాగంగా చింతల శ్రీనివాసులు ఆహ్వానం మేరకు ఆదివారం మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చెంచలబాబుయాదవ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.చింతల శ్రీను చెంచలబాబుయాదవ్‌ను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు శ్రీనివాసులు వైజాక్‌లో మంచి వ్యాపార వేత్త అని ఊరికోసం ఇలాంటి కార్యక్రమాలు చేయడం అబినందించదగ్గ విషయమని ఆయన ప్రశంసించారు. అలాగే సొంత ఊరికి ఇలాంటి వారు చేసే కార్యక్రమాలను అందరు దృష్టిలో పెట్టుకొని వారి వారి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో పోకలవారిపల్లి గ్రామ ఉత్సవ కమీటి సభ్యులు పాల్గోన్నారు.

## సంగమేశ్వరుని సన్నిధిలో భారీ శివలింగం



**సంగం నవంబర్ 19 ప్రభాతవార్త** కార్తిక మా సంలో అ త్యంత ము ఖ్యమైన కోటి సోమవారం పురస్క రించుకొని మండలకేం ద్ర మైన సంగం లోని కా మాక్షి దేవి సమేత సంగ మే శ్వరుని సన్నిధిలో పూలతో భారీ శివలింగాన్ని ఏర్పాటు చేశారు.భక్తులు పెద్దఎ త్తున కార్తీదీపాలు పెట్టి స్వా మి వారిని దర్శించుకున్నారు.కార్తిదీప శోభతో సంగమేశ్వరుని సన్నిధిలో కళకళలాడుతు కనిపించింది.

# వైభవంగా మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ట





**బిట్రగుంట, నవంబరు 19 ప్రభాతవార్త** బోగోలు మండలం కడనూతల గ్రామంలో ఆదివారం వైభవంగా శ్రీ మహాలక్ష్మి దేవి ఆలయ జీర్ణోద్ధరణ పనులు అనంతరం మహాలక్ష్మి దేవి విగ్రహ ప్రతిష్ట, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడనూతలలోని ఈ అమ్మవారి గుడి జీర్ణోద్ధరణ పనులు దాతల సహ కారంతో చేపట్టాలని గ్రామస్తులు నిర్ణయించగా స్వర్గీయ అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బచ్చు కృష్ణ కుమార్, సంధ్య దంపతులు రెండున్నర లక్షల రూపాయలు ట్రస్ట్ తరపున విరాళాన్ని అందజేశారు. పనులు పూర్తయిన తర్వాత ఈ విగ్రహ ప్రతిష్ట, ప్రత్యేక పూజల్లో బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతులు పాల్గొని జీర్ణోద్ధరణ పనుల శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు.

# మండలంలో శివనామ స్మరణలతో మారుమోగిన శైవ క్షేత్రాలు

రాపూరు,నవంబరు19ప్రభాతవార్త రాపూరు మండలంలోని పలు శైవ క్షేత్రాలు,శివాలయాలు ఆదివారం భక్తుల శివనామ స్మరణలతో మారుమోగాయి. కార్తీక మాసంలో వచ్చే పవిత్రమైన కార్తీక సోమవారం పర్వదినం సందర్భంగా భక్తులు ఉదయం నుండే నదీ,ఏటి స్నానాలు ఆచరించి మండలంలోని ప్రముఖ శైవక్షేత్రాలైన శ్రీ సిద్దిలేశ్వర కోన,బైరాగి కోన,మల్లయ్య కోనలతో పాటుమండలంలో అతి పూరతనమైన రాపూరులోని శ్రీ రామనాదేశ్వర స్వామి(శివాలయానికి) చేరుకోని కార్తీక దీపాలనువెలిగించారు.రాపూరు శివాలయంలో స్వామి వారికి ఉదయం ప్రత్యేకంగా పంచామృతాభిషేకం, భస్మాభిషేకం, రుద్రాభిషేకం, ఏకాదశ మహాసన్యాస పూర్వక రుద్రాభిషేకం ఆలయ అర్చక స్వాములు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగానిర్వహించారు. తిరిగి ప్రదోష కాలంలో స్వామి వారికి పలు రకాలైన అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున మహిళా భక్తులు శివాలయానికి చేరుకోని కార్తీక దీపాలు వెలిగించి, ధ్వజస్తంభం వద్ద అకాశ దీపాన్నిదర్శించుకోని వారి కోటి సోమవారం ఉప వాసాలు ముగించారు. శివాలయంలో ఆలయ ప్రధానార్చకుడు కారంచేటి రామనాదేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు.

# బుజబుజ నెల్లూరుకు చెందిన 100కుటుంబాలు వైసీపీలో చేరిక



నెల్లూరు సిటీ,నవంబర్19,ప్రభాతవార్త నెల్లూరు రూరల్ నియోజయవర్గంలో ప్రతిపక్ష తెలగుదేశం పార్టీకి యువత ఝలక్ ఇచ్చారు.ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులైన యువత నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి ప్రధాత ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంపై సంపూర్ణ విశ్వాసం ప్రకటిస్తూ వైసీపీలో చేరారు.నెల్లూరు రూరల్‌లోని 25వ డివిజన్ బుజబుజనెల్లూరుకు చెందిన 100కుటుంబాలు ఆదివారం నెల్లూరు ఆదాల ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పేర్నెటి కోటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో యువత ఎంపీ సమక్షంలో పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారిని ఉద్దేశించి ఎంపీ ఆదాల మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు అర్హులైన యువత,మహిళలు పెద్ద ఎత్తున నేడు చేరడం శుభపరిణామం అన్నారు.తనపై నమ్మకంతో వైసీపీలో చేరిన ప్రతి ఒక్కరికి అన్నలా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు.భవిష్యత్తులో ఎటువంటి అవసరం,కష్టం వచ్చినా నేరుగా తననుసంప్రదిస్తే ఖచ్చితంగా ముందుంటానని ఎంపీ ఆదాల హామీ ఇచ్చారు.తమ వద్దకు వచ్చేందుకు ఎటువంటి ఆంక్షలు,అడ్డంకులు లేవన్నారు.సొంత అన్నలాగా మీ అందరికీ అండగాఉంటానని భరోసా ఇచ్చారు.అనంతరం ఆదాల సమక్షంలో పార్టీలో చేరిన యువత జై జగన్,ఆదాల ప్రభాకర్‌రెడ్డి నాయకత్వం జిందా బాద్,జై జగన్,జైజై జగన్‌అనే నినాదాలతో ఎంపీ కార్యాలయాన్ని మారుమోగించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య,పాశం శ్రీనివాస్ ,నవాబ్‌జాన్,ఖలీల్,కొండేటి నరసింహారావు, వైసీపీ నాయకులు,కార్యకర్త లు,నాయకులు ,బుజబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదలకు ఇళ్ళను ఇవ్వకపోవడం దుర్మార్గం

**నెల్లూరు నవంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్ళు కావస్తున్నా ఇప్పటికీ పేదలకి ఇళ్ళను ఇవ్వకపోవడం దుర్మార్గమని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 50వ డివిజనులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో నారాయణ పాల్గొని ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో కరపత్రాలను అందచేస్తూ వైసీపీ చేస్తున్న అరాచకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో నగర నియోజకవర్గంలో 40వేల టిడ్కో గృహాలను మంజూరు చేయించానన్నారు. ఇల్లు మంజూరు చేసే సమయంలో ఎలక్షన్ కోడ్ రావడంతో వాటిని లబ్దిదారులకి అందించలేకపోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. నేను పూరి గుడిసె నుంచి వచ్చిన వ్యక్తినని, ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసునన్నారు. అందుకోసమే ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్న లక్ష్యంతో పనిచేశానని నారాయణ గుర్తుచేశాడు. నగరమంతా పార్కులు కట్టించానని, ప్రతి చిన్నారి ఆడుకునే విధంగా వెసులుబాటు కల్పించానని ఆయన తెలిపారు. ప్రజలు తీసుకునే నిర్ణయం చూస్తూంటే, ఈసారి టీడీపీ అధికారంలోకి ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దొడ్డపనేని రాజానాయుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, కప్పిర శ్రీనివాసులు, కప్పిర రేవతి, ఖాదర్‌బాష, లాజర్, రంగనాథం, ముజీబ్, హఫీజ్, అనిల్ పాల్గొన్నారు.



# రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని టిడిపి,జనసేన నిరసన



**బుచ్చి నవంబర్ 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం బైపాస్‌రోడ్డులో రోడ్లు అద్వాన్నంగా ఉన్నాయని టిడిపినాయకులు,జనసేననాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాట్లాడుతు వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రావిల్‌మాపియా, ఇసుకమాపియా,మద్యం మాఫియా, బెట్టింగ్ మాఫియాలు రెచ్చిపోయిప్రజల్ని దోచుకుంటున్నారని విమర్శించారు.రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రోడ్ల దయనీయ పరిస్దితిపై టిడిపి,జనసేన సంయుక్తంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని చెప్పారు.గత మూడు సంవత్సరాల నుండి బుచ్చిరెడ్డిపాళెం బైపాస్‌రోడ్డు అద్వాన్నంగా తయారు అయిందని దానిని పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు.కోవూరు నియోజకవర్గంలో ఏ పల్లెకు వెళ్లినా రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు.సాక్షాత్తు తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్ డబుల్‌రోడ్డుపోయి గతుకుల రోడ్డు వస్తే అదే ఆంధ్రప్రదే శ్ అని అన్నారు.పంచాయితీరాజ్‌శాఖలో రోడ్లుకాని, ఆర్‌అండ్‌బి రోడ్లు కాని ఒక్క రోడ్డు కూడా వేయలేదని విమర్శించారు. టిడిపి హయంలో రోడ్లన్ని ఎంతో అందంగా ఉన్నాయని ఆయన ప్రశంసించారు.వాహనదారులు రోడ్డుపైన వాహనాలు మరమ్మత్తులకు గురై నానా అవస్తలు పడుతున్నారని విమర్శించారు.రోడ్లు బాగుపడే వరకు నిరసన కార్యక్రమాలు చేస్తామని అన్నారు.ప్రవేటు లేవుట్‌లపైన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ఇంట్రస్టు ఉందని ప్రజలకు అవసరమైన రోడ్లుపైన ఆయనకు ఇంట్రస్టు లేదని ఎద్దెవ చేశారు. అనంతరం జనసేన కోవూరు నియోజకవర్గం నాయకులు చప్పిడి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతు వైసిపి ప్రభుత్వానికి రోడ్ల విషయం అనేక సార్లు తెలియజేసినా పట్టించుకోలేదని అన్నారు.జగన్ మోహన్‌రెడ్డిపైన ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపిస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్దిని విస్మరించారని అన్నారు. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించినందుకు లబోదిబో మంటున్నారని అన్నారు.ఈకార్యక్రమంలో భాగంగా నాయకులు వాహనాలు ఆపిడ్రైవర్లను రోడ్ల గురించి ప్రశిస్తే వారు సార్ రోడ్లుపైన వాహనాలతో వెళ్లలేకపోతున్నామని అన్నారు.ఈకార్యక్రమంలో టిడిపి అధికారప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, బత్తల హరికృష్ణా కోవూరు మండల పార్టీనాయకులు మల్లారెడ్డి, ఇందుకూరుపేట నాయకులు వీరేంద్రచౌదరి,కొడవలూరు నాయకులు మదన్, బుచ్చినాయకులు వింజం రామానాయుడు, తాళ్ల నరసింహస్వామి,బండ్ల కొండయ్య, జూగుంట పురుషోత్తమ్, దశరద్, మైనార్టీనాయకులు సర్దార్,అక్తర్,షేక్ జాపర్, కాలేషా ,వల్లూరు శ్రీనివాసులు,దుగ్గిశెట్టి హరినాద్,వింజం మహేష్‌నాయుడు, జనసేన నాయకులు మండల పార్టీ అధ్యక్షులు మాదవ్, నియోజకవర్గంలోని పలువురు జనసేననాయ కులు,టిడిపినా యకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

**కావలి రూరల్, నవంబరు 19 ప్రభాతవార్త :** 56వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను పురస్కరించుకొని కావలి వెంగళరావునగర్‌లోని ప్రభుత్వ శాఖ గ్రంధాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు గ్రంధాలయాధికారిణి ఎస్.సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కావలి విక్రమ సింహపురి యూనివర్శిటీ పిజి సెంటర్ ప్రొఫెసర్ టి.మంజుల విచ్చేసి మాట్లాడారు. మహిళా రిజర్వేషన్, మహిళా సాధికారితపై విద్యార్థినులకు వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జవహర్ భారతి డిగ్రీ కళాశాల విద్యార్థినులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కావలి అసెంబ్లీ కన్వీనర్‌గా సివిసి



**కావలి,నవంబరు 19 ప్రభాతవార్త :** బిజెపి కావలి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా సి.వి.సి.సత్యంను నియమించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగుబాటి పురంధేశ్వరి నెల్లూరులో జరిగిన సమావేశంలో ఆమె ప్రకటించారు. కావలి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా ఇప్పటికి రెండు సార్లు పనిచేశారు. ఎంతో అనుభవం వున్న ఆయనను ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సివిసిని మూడోసారి కూడా ఎంపిక చేశారు. సివిసి నియామకం పట్ల కావలి పట్టణంలోని వస్త్ర వ్యాపార ప్రముఖులు, వివిధ రంగాల ప్రముఖులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సివిసి సత్యం మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని, అందరిని కలుపుకొని పోయి రానున్న ఎన్నికలలో బిజెపి పార్టీ విజయానికి అహర్నిశలు పాటుపడతానని తెలిపారు.

## వరల్డ్ కప్ మ్యాచ్ చూసేందుకు భారీ స్క్రీన్ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే



**కావలి, నవంబరు 19 ప్రభాతవార్త :** ఇండియా, ఆస్ట్రేలియా క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్ జరుగుతున్న సందర్భంగా కావలి పట్టణ తుమ్మలపెంట రోడ్డులోని జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో ఆదివారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమా ర్‌రెడ్డి మ్యాచ్‌ని తిలకించేందుకు భారీ టివి స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, యువత, పట్టణ ప్రజలు భారీ స్క్రీన్‌లో మ్యాచ్‌ని తిలకించి సంబరపడ్డారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

## నా మాదిరి అబ్దుల్ అజీజ్‌ను నమ్మి మోసపోవద్దు



**నెల్లూరు టౌన్, నవంబర్ 19, ప్రభాతవార్త :** నేను అబ్దుల్ అజీజ్ సోదరులకు మాత్రమే వ్యతిరేకని, ముస్లింలన్నా ముస్లిం సమాజం అన్న తనకెంతో గౌరవం ఉందని ప్రముఖ పారిశ్రామిక వేత్త కిషోర్‌రెడ్డి ప్రకటించారు. అబ్దుల్ అజీజ్ ఎవరిని మోసం చేయలేదని బారాషహీద్ దర్గాకు వచ్చి ప్రమాణం చేయాలని ఆయన సవాల్ విసిరారు. నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ నన్ను చంపడానికి ప్రయత్నిస్తున్నారని, అబ్దుల్ అజీజ్ సోదరులపై చర్యలు తీసుకొని నాకు ప్రాణ రక్షణ కల్పించాలని కిషోర్‌రెడ్డి విలేకర్ల ముందు అధికారులను వేడుకున్నారు. నగరంలోని పరివార్ హోటల్లో ఆదివారం ఆయన ముస్లిం మైనార్టీ నాయకులు మున్వర్ భాషాతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముస్లింలకు తాను వ్యతిరేకం కాదని, తనకు మోసం చేసిన అబ్దుల్ అజీజ్‌కి మాత్రమే తాను వ్యతిరేకమన్నారు. ఎంతో మందికి అబ్దుల్ అజీజ్ మోసం చేశారని, అబ్దుల్ అజీజ్‌పై ఎన్నో కేసులు ఉన్నాయన్నారు. వ్యాపార లావాదేవీలో తనకు అబ్దుల్ అజీజ్ ఎంతో మోసం చేశారని ఆరోపించారు. అబ్దుల్ అజీజ్ ఎవరికి మోసం చేయలేదని, బారాషాహిద్ దర్గాకు వచ్చి ప్రమాణం చేసి నిరూపించుకోవాలని అబ్దుల్ అజీజ్‌కు సవాల్ విసిరారు. ఇకనైనా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి, తనకు న్యాయం చేయాలని కోరారు. అబ్దుల్ అజీజ్ సోదరులు లాగా నేను ఎవరికి మోసం చేయలేదుః ముస్లిం మైనార్టీ నేత మున్వర్ భాష అబ్దుల్ అజీజ్ సోదరులు ఎంతో మందికి మోసం చేశారని, మోసం చేయలేదని బారాషాహిద్ దర్గాకు వచ్చి ప్రమాణం చేయాలని అబ్దుల్ అజీజ్ సోదరులకు మున్వర్ భాష సవాల్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మీద దాడి చేయించింది అబ్దుల్ అజీజ్ సోదరులే అని తెలిపారు. తాను మందు తాగానని అబ్దుల్ అజీజ్ సోదరుడు జలీల్ చెప్పడం విడ్డూరంగా ఉందని, తాను మందు తాగి ఉంటే ముస్లిం మత పెద్దలను తీసుకొని వచ్చి రుజువు చెప్పించాలని అబ్దుల్ జలీల్‌కు సవాల్ విసిరారు. తన మీద దాడి జరిగితే.. పోలీసు స్టేషన్‌లో సాబీర్ ఖాన్, నన్నే సాహెబ్ వీళ్లిద్దరూ కేసు రాయించి, తన మీదే మళ్లీ డ్రామాలు ఆడుతున్నారన్నారు. తనకు దాడి జరిగినప్పుడు సీసీ పుటేజ్‌తో సహా బయట పెడితే, సీసీ పుటేజ్ అది కరెక్ట్ కాదని అబ్దుల్ జలీల్ పక్కదావ పట్టిస్తున్నారు. తాను ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి, తన సొంత నిధులతో ఎంతో మంది నిరుపేదల పెళ్లిళ్లకు సహాయం చేశానన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

## నేడే కూనిపాలెంలో 'నువ్వే మానమ్మకం' -పరిటాల

**వలేటివారిపాలెం నవంబరు 19,ప్రభాతవార్త :** నువే మానమ్మకం జగన్ కార్యక్రమంలో ఈ రాష్ట్రానికి సీఎంగా జగనే ఎందుకు కావాలి అనే అంశంపై ఈ నెల 20న అనగా సోమవారం కూనిపాలెంలో నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పరిటాల వీరాస్వామి తెలిపారు.శాసనసభ్యులు మహీధర్‌రెడ్డి సూచనల మేరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిద హోదాల్లో ఉన్న వైసీపీ శ్రేణులు ప్రజాప్రతినిధులు ఎంపీపీ,జెడ్పీటీసీ,స్ధానిక సంస్ధల ప్రతినిధులు,గృహసారధులు,సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొంటారని తెలిపారు. సాయంకాలం 3గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఈ రాష్ట్రానికి జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలనే విషయమును వక్తలంతా కూలంకుషంగా వివరిస్తారని తెలిపారు.

## 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



**విడవలూరు,నవంబర్19,ప్రభాతవార్త :** 56వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పిల్లలకు ఆటల పోటీలు లైబ్రేరియన్ నిరూప ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారోత్సవాలలో జరిగిన వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందిన పిల్లలందరికీ సోమవారం బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్జీవో శేఖర్,పద్మావతి,పిల్లలు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో 10 రూపాయలకే వైద్య సేవలు



**ఉదయగిరి,నవంబర్19,ప్రభాతవార్త :** మండలకేంద్రమైన ఉదయగిరిలోని విజయలక్ష్మీ ఆసుపత్రి డాక్టర్ కృష్ణదివ్యారెడ్డి వినూత్నంగా వైద్యసేవలందిస్తున్నారని ఉదయగిరి మండల ప్రజలు కొనియాడారు.అందుకు కారణం మెట్ట ప్రాంతమైన ఉదయగిరి చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే పేద ప్రజల నుండి కేవలం 10రూపాయలకే వైద్యం అందిస్తున్న తనని ఎంతో తక్కువ ఖర్చుతో తమకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని వారు తెలిపారు.ఈ సందర్భంగా కొందరు గ్రామస్తులు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ఎంబిబిఎస్ చదువుకున్న మహిళా డాక్టర్ ఉదయగిరిలో అందుబాటులో లేక చాలామంది ఆత్మకూరు,నెల్లూరు వెళ్తూ ఖర్చుతో కూడిన వైద్యాన్ని పొందుతున్నారని ఒక్కొక్కసారి ఖర్చులకు డబ్బులులేని పరిస్థితి తమదని తెలిపారు.అలాంటి పరిస్థితుల్లో డాక్టర్ కృష్ణదివ్యారెడ్డి తమకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తూ ముఖ్యంగా గర్భిణిలకు,చిన్నపిల్లలకు ఆమె చేస్తున్న వైద్యం పట్ల సంతృప్తిగా ఉన్నామని ఎన్నోచోట్ల వైద్యం కోసం తిరిగి చాలా ఖర్చు పెట్టుకున్నామని ఇప్పుడు ఆ పరిస్థితి ఉదయగిరిలో లేదని తెలిపారు.ఈ సందర్భంగా విజయలక్ష్మీ ఆసుపత్రి డాక్టర్ కృష్ణదివ్యారెడ్డి మాట్లాడుతూ తాను తన గ్రామమైన ఉదయగిరిమీద ప్రేమతో పేదప్రజలకు న్యాణమైన వైద్యం అందుబాటులోకి తేసుకుని రావాలనే ఉద్దేశంతో అన్ని సౌకర్యాలతో ఈ వైద్యశాలను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు.చుట్టుపక్కల గ్రామాల నుండి వస్తున్న ప్రజలు తనపై నమ్మకంతో మరింతమందికి తన వైద్యం గురించి తెలియజేసి వారు కూడా మంచివైద్యం పొందాలని కోరుతున్నట్లు తెలిపారు.

## నాణ్యమైన ప్రమాణాలతో జగనన్న కాలనీలు నిర్మాణం



**ఉదయగిరి,నవంబర్19,ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని గంగిరెడ్డిపల్లె దగ్గర నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో లబ్ధిదారులు తమ సొంత నిర్మాణాలను కాంట్రాక్టర్ వెంకటేష్ చేత పూర్తి చేయిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మాసాయపేటకు చెందిన రమణమ్మ మాట్లాడుతూ కూలిపనికి వెళ్తే కానీ పూట గడవని తమకు అక్కడే ఉండి ఇళ్లు కట్టించుకుటుంటే జీవనం కష్టతరమవుతుందని కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించామని తెలిపారు.కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు నీటి సరఫరా,కరెంటు సరఫరా,నాణ్యమైన వస్తువులను వాడుతూ ప్రభుత్వం నియమించిన నిబంధనల ప్రకారం పునాదులు ఏర్పాటు చేశారని తన సొంత ఇంటిలాగానే అన్ని విధాలా సహకరిస్తూ నిర్మాణాలు పూర్తి చేస్తున్నారని తెలిపారు.ఎక్కడా కూడా నాణ్యమైన వస్తువులను వాడటంలో వెనకడుగువేయకుండా మంచి అనుభవంతో ఇళ్లను నిర్మిస్తున్నారని మరొక లబ్ధిదారులు తెలియజేశారు.దాదాపుగా 40జగనన్న కాలనీలను నిర్మిస్తున్న అతను మాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని తానే చూసుకుంటున్నారని తెలిపారు.ఈ సందర్భంగా వైసీపీ మండల కన్వీనర్ సీ.ఎమ్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు జగనన్న కాలనీలు ఎంతో ఉపయోగకరంగా ఉండబోతున్నాయని నాణ్యతా ప్రమాణాలు పూర్తిస్థాయిలో పాటిస్తూ ఎక్కడా కూడా రాజీ పడకుండా కాంట్రాక్టర్ చేత పనులు పూర్తి చేయిస్తున్నామని హౌసింగ్ ఏఈ,మిగతా అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రాంతంలో జగనన్న కాలనీలు ఒక చరిత్ర సృష్టించబోతున్నాయని తెలిపారు.

## కోడిపందాల స్ధావరాలపై మెరుపు దాడులు

**విడవలూరు,నవంబర్19,ప్రభాతవార్త :** మండలంలోని పొన్నపూడి,పెద్దపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడిపందాల స్ధావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు.స్ధానిక ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు కోడిపందాల స్ధావరాలపై దాడులు చేయడం జరిగింది.ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులు,రెండు కోళ్లు,రెండు వేల రూపాయలు నగదు పట్టుబడ్డాయి. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకి హాజరు పరుస్తామన్నారు.

## కాకర్ల పెళ్ళి కానుక అందజేత



**వింజమూరు,నవంబర్19,ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలో ని మోటచింతలపాళెం లోని ఆరికొండ సుబ్బారావు- కొండమ్మల కుమార్తె వివాహానికి ఉదయగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు , కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకర్ల సురేష్ 10వేల రూపాయలను పెళ్ళికానుక గా సునీతకు అందజేశారు. నూతన వధూవరులైన శేఖర్-సునీతలను ఆశీర్వదించారు. ట్రస్ట్ ప్రతినిధులు పవన్, వింజ మూరు మండల ఐటిడిపి కోఆర్డినేటర్ ఆరికొండ శ్రీనివాసులు , టిడిపి ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

## గుంటల రోడ్లుతో ఎన్నాళ్ళు ఈ అవస్థలు



**కలువాయి నవంబర్ 19 ప్రభాతవార్త** గుంటల రోడ్లతో ఎన్నాళ్ళు ఈ పాట్లు అంటు జనసేన తెలుగుదేశం ఉమ్మడి సారద్యంలో వెంకటరెడ్డిపల్లి సమీపంలో రోడ్లపైన బైఠాయించి ఆదివారం నిరసన తెలిపారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లి నుండి కుల్లూరుకి పోవు ప్రధాన రహదారి మీద జనసేన,తెలుగుదేశం నాయకులు ఉమ్మడి కార్యచరణ నిమిత్తం డిజిటల్ కాంపైన్ నిర్వహించడం జరిగింది. జనసేన పార్టీ వెంకటగిరి సమన్వయకర్త గూడూరు వెంకటేశ్వర్లు అదే విదంగా తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గోనుగుంట వెంకటేశ్వర్లునాయుడు పాల్గోనగా వారు మాట్లాడుతు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుండి ప్రతి సంవత్సరం జనసేన పార్టీ ఆద్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రోడ్లమీద డిజిటల్ క్యాంపెయిన్ నిర్వహిస్తు రోడ్లు మరమ్మత్తులు నిర్వహించమని సోషల్ మీడియాతోపాటు పలువిధాలతో వేదికగా నిరసన తెలుపుతున్నామని అన్నారు. అయిన్పటికి రోడ్లు రూపురేఖలు ఏమాత్రం మారలేదని వారు అసహనం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రిగాఢనిద్రలో నుండి మేలుకొని ప్రజాపాలన చేయాలని ప్రజల డబ్బుతో రోడ్లు వేయడం కూడా కష్టంగా ఉందని ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.రాబోవు 2024 ఎన్నికలలో జనసేన,తెలుగుదేశం ఉమ్మడి ప్రభుత్వాన్ని స్ధాపించాలని వారు తెలిపారు.ఈకార్యక్రమంలో జనసేన మండలాద్యక్షులు వెంకటపతి, రామకిషోర్,టిడిపినాయకులు గడ్డం కిషోర్‌రెడ్డి పీర్ల సోమయ్య యాదవ్,జగదల్‌నాయుడు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

**విడవలూరు,నవంబర్19,ప్రభాతవార్త :** డిగ్రీ కళాశాల ఆవరణంలో ట్రాక్టర్ ఆటోను ఢీకొని అన్నారెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఐదుమందికి గాయాలైన వారిలో ముగ్గురికి మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించారు.ట్రాక్టర్ కొడవలూరు మండలం అర్లపాడు గ్రామానికి చెందినదిగా గుర్తించారు.డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

## గ్రంథాలయంలో మహిళా దినోత్సవం




**వింజమూరు,నవంబర్19,ప్రభాతవార్త :** వింజమూరు గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలను లైబ్రేరియన్ జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లగొండ్ల సృజన, కాంగ్రెస్‌పార్టీ పిసిసి సభ్యులు మద్దూరి రాజగోపాల్‌రెడ్డిలు భారత మహిళా తొలిప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా దేశ నేతలను , సంఘ సేవకులను గుర్తుకుతెచ్చుకొని వారి సేవలను విద్యార్థులకు తెలియజేశారు. సకల రంగాలకు చెందిన విజ్ఞానమంతా గ్రంథాలయం లో ఉంటుందని అవసరమైన గ్రంథాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను గ్రంథాలయంలో లభ్యమవుతాయన్నారు . గ్రంథాలయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దిశ చట్టం గురించి సర్పంచ్ , మహిళా పోలీసులు తెలియజేశారు .ఈకార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్‌మార్నింగ్ సియంసార్! గుంటలు పూడ్పించండి జగన్‌సార్!

**కలిగిరి, నవంబర్19, ప్రభాతవార్త;** సియం జగన్‌సార్ నాలుగేళ్లల్లో అబివృద్ధి ఏమోగానీ ఒక్కరోడ్డు గుంటలు పూడ్చిందిలేదంటూ జనసేన, టిడిపిఉమ్మడి నిరసన కార్యక్రమం కార్యక్రమం చేపట్టింది.జనసేన, టిడిపి ఆద్వర్యంలో ఆదివారం కలిగిరిలోని కొండాపురం రోడ్డులోఇరుపార్టీ నాయకులు వినూత్ననిరసనకుదిగారు. ఈసందర్భంగా గుంటలమయమైన రోడ్డుపై నిలబడి గుడ్‌మార్నింగ్ సియంసార్ గుంతలు పూడ్చండి జగన్‌సార్ అంటూ నినాదాలు చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అబివృద్ధి కనిపించలేదని ప్రతిపక్షాలపైన కక్ష సాదింపుపైనే వైసిపి ప్రభుత్వం ఎక్కువ మనసుపెడుతుందన్నారు.

వైసిపి పాలనలో ప్రజలు విసిగి వేసారి పోయారన్నారు.జనసేన అద్యక్షులు పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు జనసైనికుల చేపట్టిన ఈవినూత్నకార్యక్రమానికి టిడిపికలిసి రావడం ప్రతిపక్షాల ఐక్యతను భలం చేకూరినట్లైందన్నారు. ఈకార్యక్రమంలో జనసేన కలిగిరి మండల పార్టీ అద్యక్షులు బండారులక్ష్మీన్నారాయణ,దిలీప్ కుమార్, తెలుగుదేశంపార్టీ మండలఅద్యక్షులు బిజ్జం క్రిష్ణారెడ్డి, బండారు మల్లికార్జున,కొండపల్లి వెంకట్రావు ,నిశ్శకర సురేష్,నిశ్శంకర రామయ్య తదితరులు పాల్గొన్నారు.



## పల్లెపాడు గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్ధనలు



**ఇందుకూరుపేట, నవంబర్ 19, ప్రభాతవార్త** మండలంలోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల, ధనుశ్రీ, మహాత్మాగాంధీ విగ్రహానికి, పొనక, కనకమ్మ విగ్రహాలకు ఖాదీవస్త్రం, నూలు మాల సమర్పించారు. అనంతరం ఇందుకూరుపేట హైస్కూల్ ఉపాధ్యాయులు పీవీ శేషయ్య మహాత్మాగాంధీజీ ఆయన ఆశయాల గురించి, పొనక కనకమ్మ, స్వతంత్ర్య సమరంలో ఆమె చేసిన ధైర్య సహస్ర గురించి స్కూల్ విద్యార్థులకు వివరించారు. అనంతరం భగీరథ వాకింగ్ గ్రూపులు పినాకిని సత్యాగ్రహం గాంధీ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమ చరిత్ర గురించి కోకన్వెంట్ నెల్లూరు రవీంద్రారెడ్డి వివరించారు. భగీరథ వాకింగ్ గ్రూపులు ఆశ్రమంలో ముందుగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి వన భోజనం కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో సునీల్ కుమార్, వెంకటేశ్వర్లు, కిషోర్, సూరి ప్రకాష్, సురేష్, అరుణ్, భగీరథ, వాకర్స్ టీం, స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది..




**తోటపల్లిగూడూరు, నవంబర్ 19, ప్రభాతవార్త** మండలంలోని పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్ రహదారి మార్గంలో ఆదివారం తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో గుంతల మయంగా మారిన రహదారుల అధ్వాన్న స్థితిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తోటపల్లిగూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ జనసేన బాధ్యులు బి.సురేష్‌నాయుడు వారి సందేశాలలో వైకాపా పాలనపై విమర్శలు గుప్పించారు. ఈనెల జనసేన, టీడీపీ సంయుక్తంగా కలిసి రాష్ట్రంలో అధ్వాన్న స్థితిలో ఉన్న రహదారులపై నిరసన వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. ప్రధానంగా పర్యాటక కేంద్రంగా మారిన కోడూరు బీచ్ రోడ్డు గుంటలు మంత్రికి కనిపించడం లేదా అని వారి ఇరువురు ప్రశ్నించారు. వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రోడ్ల మరమ్మత్తులకు రూ.21 వేల కోట్లు కేటాయించామని చెప్పడం జరిగిందని, ఆ పనులు ఎప్పుడు చేస్తారో అర్థం కావడం లేదన్నారు. ఇసుక, సిలికాన్‌పై దృష్టి తప్ప రోడ్ల పరిస్థితి పట్టించుకోకపోవడాన్ని వారు విమర్శించారు. రాబోవు ఎన్నికలలో టీడీపీ, జనసేన విజయబావుటా ఎగురవేయగలదని నేతలు పేర్కొన్నారు. అయితే ఈ నిరసనలో మండల పార్టీ అధ్యక్షులు సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం నేతలు రాబోయే ఎన్నికల్లో గెలుపు మాదేనంటూ ఉత్సాహంగా కనిపించారు. టీడీపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, సీహెచ్ మల్లిఖార్జుననాయుడు, చింత సీతారామయ్య, ఊటుకూరు శ్రీనివాసులు, ఊటుకూరు అవినాష్, జనసేన మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నడవల రవికుమార్, శరత్, కాపు నేస్తం ప్రతినిధి వాణి భవాని, పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సహకార సొసైటీ సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, నవంబరు19 ప్రభాతవార్త :** సహకార సొసైటీ చేస్తున్న సేవలను సంబంధిత సొసైటీ పరిధిలోని రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలనిపడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార పరపతి సంఘం కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం 70వ సహకార వారోత్సవాల సందర్భంగా సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడుగుపాడు సొసైటీలో ప్రత్యేకంగా బ్యాంక్ ఏర్పాటు చేయడమే కాకుండా, బంగారంపై రుణాలు అందించడం కాకుండా, లాకర్ సదుపాయం కూడా కల్పించడం జరిగిందన్నారు. రైతులు ఇటువంటి మంచి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సహకార ఎడ్యుకేషనల్ అధికారి శ్రీనివాసులు జెండా యొక్క విశిష్టతను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ కోఆపరేటివ్ అధికారి కె.తిరుపాల్ రెడ్డి, ఎస్‌డీఎల్‌సీవో కేవీ సుభాషిణి, కోవూరు సహకార బ్యాంక్ మేనేజర్ సుధాకర్, సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

## మహనీయుల అడుగుజాడల్లో పయనించాలి

**కోవూరు, నవంబరు19 ప్రభాత వార్త** : దేశ స్వాతంత్ర్య సమ పార్జన కొరకు తమ ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా పెట్టిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవడమే కాకుండా వారి అడుగుజాడల్లో నేటి యువత పయనించాలని గ్రంథాలయ బాం డాగారి జె.సురేంద్రరెడ్డి తెలిపారు. కోవూరులోని శాఖా గ్రం థాలయంలో వారం 56వ గ్రం థాలయ వారోత్సవాల సంద ర్భంగా మాజీ ప్రధాని



ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి పుస్తక పఠనాన్ని తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. దీని వలన వారి మేదస్సు మరింత మెరుగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళామణులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంల ఇందిరాగాంధీ మన దేశానికి మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా దేశానికి ఎనలేని సేవ చేశారన్నారు. ఈ సందర్భంగా ఉర్దూ ఉపాధ్యాయురాలు దివినమ్మ, ప్రధానోపాధ్యాయురాలు కె. భారతిలను శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. అంతకుముందు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## అల్లూరు గ్రంధాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



అల్లూరు, నవంబరు 19 ప్రభాతవార్త ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా అల్లూరు బాపూజీ పార్కు వద్ద వున్న గ్రంధాలయంలో ఆదివారం ఆమె జయంతిని నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి లైబ్రేరియన్ కోటేశ్వరి, పాఠకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 56వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో ఇందిరాగాంధీ జయంతి జరుపుకోవడం జరిగిందన్నారు. పాఠకులతో దిశ చట్టంపై చర్చించడం జరిగిందని తెలిపారు.

## మొక్కలు జీవకోటికి ప్రాణవాయువును ఇస్తాయి



**కోవూరు, నవంబరు19 ప్రభాతవార్త** : జిల్లాలో పడుగుపాడు సహకార సొసైటీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని, సొసైటీ అందిస్తున్న సేవలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ కోఆపరేటివ్ అధికారి తిరుపాల్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార సొసైటీ ప్రాంగణంలో ఆదివారం వారోత్సవాల సందర్భంగా మొక్కలు నాటే కార క్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో ఇప్పటికే నాలుగు గోదాములు నాబార్డు సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా సొసైటీ ప్రాంగణంలో 200 టన్నుల గోదాము కూడా సిద్ధంగా ఉందని, రైతులు తాము పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చేవరకు ఈ గోదాముల్లో పెట్టుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. త్వరలో సొసైటీ పరిధిలోని ఇనమడుగు గ్రామంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ కూడా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పూర్తయ్యాయన్నారు. అదేవిధంగా సొసైటీ కార్యాలయంలో మీ సేవ కేంద్రం ఏర్పాటుకు ఆదేశాలు వచ్చాయన్నారు. 1904వ సంవత్సరంలో ఏర్పాటైన సహకార సంఘాలకు 120 ఏళ్లకు పైగా చరిత్ర ఉందన్నారు. ఈ సొసైటీలో బంగారంపై తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నామని, రైతులు సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి 70 లక్షలతో ప్రారంభించిన ఈ సొసైటీ ప్రస్తుతం 20 కోట్ల మేరకు రుణ సౌకర్యం అందించేలా ఎదిగిందన్నారు. త్వరలో ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలకు కూడా రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా సొసైటీ ద్వారా రైస్ వ్యాపారం చేసేలా సమావేశంలో తీర్మానం కూడా చేయడం జరిగిందన్నారు. ఈ కార్యమ్రంలో సొసైటీచైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, ఎస్‌డీఎల్‌సీవో సుభాషిణి, కోవూరు సహకార బ్యాంక్ మేనేజర్ సుధాకర్, ఎడ్యుకేషన్ అధికారి శ్రీనివాసులు, రైతులు ఉన్నారు. అనంతరం రైతులు అధికారులు ప్రమాణ కార్యక్రమాన్ని చేపట్టారు.

## నిరుపేద చేనేత కుటుంబాన్ని ఆదుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం



**కోవూరు, నవంబరు 19 ప్రభాతవార్త** : కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామానికి చెందిన నిరుపేద చేనేత కుటుంబం బి. శ్రీనివాసులు ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ చేనేత ఉద్యోగుల ప్రొఫెషనల్ సంక్షేమ సంఘం ఆ కుటుంబానికి ఆదుకోవాలని సంకల్పించింది. ఈ మేరకు ఆదివారం గుమ్మలదిబ్బలోని రామాలయం వద్ద శ్రీనివాస్ కుటుంబానికి రూ. 50 వేలు అందజేశారు. అదేవిధంగా ఆ గ్రామానికి చెందిన ఐదు మంది నిరుపేద వృద్ధ చేనేత కుటుంబాలకు మరో 10 వేల రూపాయలతో నిత్యావసర వస్తువులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు కేవీ శేషయ్య మాట్లాడుతూ ఇటువంటి చేనేత కుటుంబాలు ఆకస్మిక ప్రమాదాలకు గురైన సందర్భంగా వారిని ఆదుకోవడం జరిగిందన్నారు. చేనేతలు విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో ఎదగాలని ఐకమత్యంతో అది సాధ్యమవుతుందన్నారు. నెల్లూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి. మల్లికార్జున, ఎస్. శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సీహెచ్ కృష్ణ, గౌరవాధ్యక్షులు కె. వెంకటరమణయ్య, సుబ్బారావు, ప్రభాకర్‌రావు, ఆంధ్రప్రదేశ్ చేనేతల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి నరేంద్ర , కోవూరు దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షులు పి. మధు తదితరులు ఉన్నారు.

## శ్రీ మహావిష్ణువు,శ్రీ అయ్యప్ప ఆలయంలో అరవ రోజు అన్నదానం

**రాపూరు,నవంబరు19ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు,శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా నిర్వహిస్తున్న మండల కాల(41 రోజులు) అన్నదానం కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తునహజరైతున్నారు. అన్నదాన కార్యక్రమంలో అరవ రోజైన ఆదివారం ఉదయం స్వామి వారి ఆలయంలో ఉదయంప్రత్యేక,పూజలు,భజనలు నిర్వహించి మద్యాహ్నం అయ్యప్ప స్వాములకు,గోవింద స్వాములకు, స్వామి వారి భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శ్రీమహావిష్ణువు ధ్వజస్తంబం వద్ద అకాశ దీపం వెలిగించిన అనంతరం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు,భజనలునిర్వహించారు. తదుపరి మాలాధారణ చేసుకున్న స్వాములకు రాత్రి బిక్ష కార్యక్రమం నిర్వహించారు. మద్యాహ్నంబిక్ష కార్యక్రమానికి దాతలుగా సైదాపురం మండలం చీకవోలు గ్రామానికిచెందిన పెరిమిడి అశోక్ రెడ్డి కుటుంబ సభ్యులు,రాపూరుకు చెందిన ఫలసరుకుల వ్యాపారి శనగపల్లి నరసింహులు కుటుంభ సభ్యులు వ్యవహరించారు. రాత్రి బిక్షను రాపూరుకు చెందిన పిల్లకదుపు వెంకటరమణయ్య కుటుంభసభ్యులు నిర్వహించారు. పెద్ద ఎత్తున స్వాములు,ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు

**జోరేవల్లి(రావూరు), నవంబరు19ప్రభాతవార్త**



మండలంలోని జోరేపల్లి గ్రామంలో గత నెల విగ్రహ ప్రతిష్ట కావించిన శ్రీ అభయాంజనేయ స్వామివారి విగ్రహానికి ఆధివారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారి మూలమూర్తికి, స్వామి వారి పెద్ద విగ్రహానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, పాలు,పెరుగు,నెయ్యి,తేనే,పంచదారలతో పంచామృతాభిషేకం,,పలు రకాలైన పండ్లు, పసుపు,కుంకుమ, చందనం, పలు రకాలైన సుగంధ ద్రవ్యాలు,వివిద రకాలైనపుష్పాలతో ప్రత్యేకంగా అభిషేకాలను అర్చక స్వామి నారాయణ స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో శాస్త్రోక్తంగానిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. గ్రామానికి చెందిన అకిలి రమణా రెడ్డి,పద్మావతమ్మ, కుటుంభ సభ్యులు ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు.

## ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధి జయంతి వేడుకలు



రాపూరు,నవంబరు19ప్రభాతవార్త మండల కేంద్రమైన రాపూరులోని ప్రభుత్వ గ్రంధాలయంలో ఆదివారం దేశ మాజీ ప్రధాని స్వర్గియ ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవం, మహిళాసాధికారితపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించి దేశ ప్రధానిగా స్వర్గియ ఇందిరా గాంధి దేశానికిఅందిచిన సేవలను కోనియాడారు. ఈ సందర్భంగా రాపూరు 7వ వార్డు సభ్యురాలు ఎస్‌డీ ఆరీఫాను గ్రంధాలయఅధికారిణి జె.ధనమ్మ సత్కరించారు. గ్రంధాలయ సహాయకుడు వెంకటేశ్వర్లు, పలువురు విద్యార్ధినీ, విద్యార్థులు, పాఠకులు వున్నారు.

## గిరిజనులకు దుస్తులు పంపిణీ



**బిట్రగుంట, నవంబరు 19 ప్రభాతవార్త** బోగోలు మండలం తాళ్ళూరు గిరిజన కాలనీలో ఆదివారం బోగోలుకు చెందిన పూజి బ్యూటీ పార్లర్ అధినేత మానికల ఐశ్వర్య గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆమె తన జన్మదిన వేడుకల్ని గిరిజనుల మధ్య జరుపుకొని తనవంతు సాయంగా వీటిని నిరుపేదలకు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను సంపాదించిన మొత్తంలో కొంత పేదలకు ఇవ్వాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విజేతలకు లక్ష రూపాయల వరకు బహుమతులు



**కోవూరు, నవంబరు 19 ప్రభాతవార్త** : ఇందిరాగాంధీ స్మారక ఆలిండియా చెస్ పోటీల్లో కృష్ణా, అనంతపురం కర్నూల్, కడప తదితర ప్రాంతాలతో పాటు తెలంగాణ, తమిళనాడు నుంచి కూడా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని,విజేతలకు లక్ష రూపాయల వరకు బహుమతులుఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందని. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్ తెలిపారు. ఈ పోటీలకు దేశమంతటా వివిధ ప్రాంతాల నుంచి ప్రపంచ చెదరంగం సమాఖ్యకు చెందిన టైటిల్ క్రీడాకారులు 2, ఇంటర్నేషనల్ మాస్టర్లు 4, ఫిడే మాస్టర్ 1, 57 మంది అంతర్జాతీయ ఫిడే రైటింగ్ కలిగిన క్రీడాకారులు కూడా ఈ పోటీలో పాల్గొన్నారని టోర్నీ డైరెక్టర్లు ఎస్. వెంకటేష్, డాక్టర్ మధుసూదన్‌లు తెలిపారు.

## ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చెయ్యవచ్చు




**నెల్లూరు నవంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** ప్రతి ఒక్కరు ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లాశాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం దాసరి రాజేంద్రప్రసాద్ జన్మదినంగా సందర్భంగా ఆయన స్వచ్ఛందంగా 47వసారి రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రక్తదానం చేశారు. అనంతరం రక్తదాన ఆవశ్యకత గురించి వివరించాడు. ఈ సందర్భంగా దాసరి రాజేంద్రప్రసాద్‌ని రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ చంద్రగిరి అజయ్‌బాబు శాలువా కప్పి సన్మానించారు. అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు జివి నరసయ్య బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ పి భాస్కర్, న్యాయవాదులు ఒ వెంకటరాజు, పి రామకృష్ణ, జి కేశవులు, మొర్గ్ కన్వీనర్ ఏ సాయిరాం, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలపై మితిమీరుతున్న దాడులు



**నెల్లూరు నవంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** జగన్ అధికారం లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు బీసీలపై దాడులు పెరిగి పోయాయని తెలుగుదేశం పార్టీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర మండిపడ్డారు. ఆదివారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాం మాట్లాడుతూ జగన్ సీఎం అయిన తరువాత రాష్ట్రంలో ప్రజా స్వామ్యం మంట కలిసిపోయిందన్నారు. బీసీలపై పూటకో దాడి, రోజుకో హత్య అన్నట్లు సాగుతోందన్నారు. చంద్రబాబు అధికా రంలోకి వచ్చేనాటికి రూ.16వేలకోట్లు లోటుబడ్జెట్ ఉన్న రాష్ట్రంలో బీసీలు కోసం ప్రత్యేకంగా సబ్‌ప్లాన్ తీసు కొచ్చారని, కార్పొరేషన్ ఏర్పాటు చేసి వేలకోట్లు బడ్జెట్‌లో కేటాయించారన్నారు. కార్పొరేషన్ ద్వారా లక్షలాది మందికి రుణాలు ఇచ్చారని తెలిపారు. ఆదరణతో పని ముట్లు, విద్యా ఉద్యోగ ఉపాధికి ప్రోత్సాహకాలు అందించారని ఆయన వివరించాడు. రాష్ట్రస్థాయి పదవుల్లో బీసీలను నియమించి రాజకీయంగా ప్రోత్స హించిన ఘనత చంద్రబాబుదన్నారు. జగన్ వచ్చాక బీసీల సంక్షే మ పథకాలను రద్దుచేసి వారి నిధులను, అధికారాలను లాక్కొని వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే పరిమితం చేశాడన్నారు. జగన్ లాంటి వాళ్లకి బస్సుయాత్రలు చేసే అర్హత ఉందనాని ఆయన ప్రశ్నించాడు, బడుగు బలహీనవర్గాలు చంద్రబాబు పాలనకోసం ఎదురుచూస్తున్నాయని, వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన 30బీసీల సంక్షేమ పథకాల ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జగన్ బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని అందరూ గమనిస్తున్నారని, జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. 2024లో చంద్రబాబు సీఎం కావడం ఖాయమని గంజాం వెల్లడించారు.

## యుద్ధ ప్రాతిపధికన రోడ్లు వేయాలి

**నెల్లూరు నవంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** రూరల్ నియోజవర్గ పరిధిలోని 29వ డివిజనులో ఉన్న మహాత్మాగాంధీనగర్, వెంకటరెడ్డినగర్లను యుద్ధ ప్రాతిపధికన రోడ్లు వేయాలని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు కార్యదర్శి కనపర్తి గంగాధర్, గుద్దేటి చెంచయ్య, షేక్ అస్లాం, జనసేన డివిజన్ అధ్యక్షుడు చుక్కల భీమయ్యలు డిమాండ్ చేశారు. ఆదివారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిల ఆదేశాల మేరకు గుంతల ఏపీకి దారేది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైసీపీ ప్రభుత్వం చిన్నచిన్న వర్షానికి ఏర్పడిన గుంతలను పూడ్చడం లేదని ఆరోపించారు. రూరల్ నియోజకవర్గంలో రోడ్లు అధ్వాన పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మౌలాలి, కృష్ణ, షాజహాన్, గీత, దస్తగిరి, కుమార్, ఫరూక్, షేక్ అబ్దుల్లా జనసేన నాయకులు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీల 26 సంక్షేమ పధకాలను పునరుద్దరించాలి




**నెల్లూరు నవంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** గత నాలుగున్నరేళ్ళుగా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన, ఎస్సీల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన 26 అభివృద్ధి పథకాలను తక్షణమే పునరుద్దరించాలని భారతీయ జనతా పార్టీ ఎస్సీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ కార్పొరేషన్ల ఎదుట ధర్నాలు, నిరసనలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఇచ్చిన ఆదేశాల మేరకు బైరి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని పలువురి ఎమ్మెల్యేలకి కేంద్ర ప్రభుత్వ సహకారంతో అందిస్తున్న 26 సంక్షేమ పథకాలు తిరిగి ఇవ్వాలని వారి కార్యాలయాల ఎదుట నిరసనలు చేసి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆ పథకాలను ఇవ్వకుండా ఎస్సీల ఆర్ధికమూలాలను జగన్ దెబ్బతీస్తున్నాడని ఆరోపించాడు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 750కి పైగా దాడులు, హత్యలు, మానభంగాలు, ఆత్మహత్యలకు ప్రేరేపించే విధంగా జరిగిన సంఘటనలపై గౌరవ హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశాడు. డిసెంబర్‌లో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఏపీ కోటిమందికిపైగా ఉన్న ఎస్సీలు మీకు ఓట్లు వేసినందుకు మా పథకాలు, మా నిధులు, మానప్రాణాలపై గట్టిగాఇ మాట్లాడి, అసెంబ్లీలో జగన్‌కి తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి, మేలింగి మాల్యాద్రి, రమణమూర్తి, ప్రసాద్, పోట్లూరి శ్రీనివాసులు, యాకసిరి ఫణిరాజు, మండ్ల ఈశ్వరయ్య, మిడతల రమేష్, కుడుముల గిరికుమార్‌గౌడ్, ప్రసన్న, సుజన, మల్లి రవి, కృష్ణ మస్తానయ్య, అశోక్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జువ్వలదిన్నెకు ఎమ్మెల్యే రాక

బిట్రగుంట, నవంబరు 19 ప్రభాతవార్త బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామానికి సోమవారం కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రానున్నట్లు మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు యాదవ్ తెలిపారు. తీర ప్రాంతంలో మత్స్యకారులు వేటకు వెళ్లినప్పుడు ఇతర రాష్ట్రాల నుండి వచ్చే మత్స్యకారులు ఈ ప్రాంత మత్స్యకారల వలలను తీవ్రంగా నష్టపరుస్తుండటంతో ఈ సమస్యని స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకుపోగా ఇతర ప్రాంతాల నుండి వచ్చే మత్స్యకారులు ఈ ప్రాంత వలలను నాశనం చేయకుండా పెద్ద మరబోటు మంజూరు చేశారన్నారు. గస్తీ కోసం ఏర్పాటు చేసే మరబోటును ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఈ కార్యక్రమంలో మత్స్యకారులంతా పాలుపంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## శివ,కేశవులిద్దరికి ముఖ్యమైనది కోటి సోమవారం



**బుచ్చి నవంబర్ 19 ప్రభాతవార్త** కోటి సోమవారం పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని శివాలయంలో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మహిళలు కార్తికదీపాలు పెట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌స్వామి భక్తుల నుద్దేశించి కోటి సోమవారం యొక్క విశిష్టత గురించి వివరించారు. కార్తికమాసంలో సప్తమితిధి,శ్రవణానక్షత్రం, సోమవారం మూడు కలిసి వస్తేదానిని కోటి సోమవారం అని అంటారని తెలిపారు. కార్తిక మాసంలో ఏరోజు శ్రవణానక్షత్రం వస్తుందో దానిని కోటి సోమవారం అంటారని తెలిపారు. కోటి సోమవారం శివ,కేశవులిద్దరికి అత్యంత ప్రీతికరమైనదని అన్నారు. శ్రవణానక్షత్రం శ్రీమ హావిష్ణువు జన్మ నక్షత్రం,అలాగే కార్తికమాసంలో సప్తమితిధి అంటే పరమేశ్వరుడికి ఎంతో ఇష్టం ఈ రెండు కలిసి వస్తేనే కోటి సోమవారం అని అంటారు. కోటి సోమవారం రోజున చేసే పూజ కోటి రెట్ల ఫలితాన్ని ఇస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరు కోటిసోమవారం పురస్కరించుకొని శివుడ్ని,మహావిష్ణువు రూపాలైన దేవుళ్లన్ని దర్శించు కోవాలని స్వామి భక్తులకు వివరించారు. పూజాలు,అభిషేకాలు అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## 27వ తేదీన కందుకూరులో జరిగే బీసీ సదస్సును విజయవంతం చేయండి



**నెల్లూరు టౌన్, నవంబర్ 19, ప్రభాతవార్త** ఈ నెల 27వ తేదీ కందుకూరులో జరిగే బీసీ సదస్సును విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పలమాల శ్రీహరిరావు పిలుపునిచ్చారు. నెల్లూరు నగరం హరినాథ్ పురంలోని రాధే గెస్ట్ ఇన్ హోటల్‌లో ఆదివారం శ్రీహరి అధ్యక్షతన బీసీ సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర యువజన అధ్యక్షులు జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ సోమవారం కందుకూరులో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సోమరాజు అధ్యక్షతన జరుప తలపెట్టిన రాష్ట్రస్థాయి బీసీ సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ముఖ్యంగా కందుకూరు నియోజకవర్గంలోని బీసీ కుటుంబ సభ్యుల వారికి పలు డిమాండ్స్‌పై అవగాహన కల్పించి, చైతన్య పరచాలని దృఢ సంకల్పంతో బీసీ సదస్సును నిర్వహిస్తున్నామని ప్రకటించారు. జనగణన నిర్ధిష్ట ప్రణాళికలతో వెంటనే నిర్వహించాలని, పార్లమెంటులో ఆమోదించబడిన మహిళా బిల్లులో ఓబీసీ మహిళా వాటా ఎంతో తేల్చాలని ప్రతి జిల్లా పార్లమెంటులో బీసీలకు మూడు టికెట్స్ కేటాయించాలి, అదే విధంగా బీసీలకు చట్టబద్దత కలిగిన సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని అంతే కాకుండా విధులు, నిధులు లేని బీసీ కులాల కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి కులాల మధ్య చిచ్చుపెట్టి అంతరాలు ఏర్పరుస్తున్నారని ఇటువంటి వ్యవహారాలు మానుకొని బీసీల అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలు ప్రభుత్వాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో బీసీల సత్తా ఏమిటో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో చూపిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పలమాల శ్రీహరిరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టంలాగా బీసీలకు కూడా అట్రాసిటి చట్టం వర్తించేలా బిల్లు పెట్టి చట్టబద్దత కల్పించాలని,బీసీలకు చట్ట సభల్లో రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బూదాట రాధాకృష్ణయ్య, రాష్ట్ర సమన్వయ కర్త బ్రహ్మశ్రీ గోనుగుంట బ్రహ్మనంద శర్మ, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సోమ రాజు, విజయమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యువజన అధ్యక్షులు కిరాణా చారి, జనరల్ సెక్రటరీ చిలకపాటి మాల్యాద్రి,యూత్ జనరల్ సెక్రటరీ సుమన్, సిటీప్రెసిడెంట్ పులుసు వాసు, జిల్లా ఉపాధ్యక్షులు నూర్‌భాషా, దూదేకుల ముస్లిం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో అధ్వాన్నంగా రోడ్లు- కురుగొండ్ల



**సైదాపురం, నవంబర్ 19, ప్రభాతవార్త** వైసీపీ పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, దీంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి నెలకొందని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురంలో తెలుగుదేశం పార్టీ- జనసేన పార్టీ పిలుపు మేరకు గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేదీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో సైదాపురం- డేగపూడి రోడ్డులో ఆదివారం బైటాయించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లు, ప్రజల సమస్యలను గురించి పట్టించుకునే పరిస్థితి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి చేయడం చేతకాదని తెలిపారు. సైదాపురంలో అక్రమ మైనింగ్ ఎక్కువైందని, వీటి వల్ల ఈ రహదారులపై పరిమితికి మించి అధిక లోడ్‌లతో వాహనాలు తిరగడం వలన పూర్తిగా రహదారులు దెబ్బతిన్నాయని, దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ పరిశీ లకులు జిన్ని రమణయ్య, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త గూడూరు వెంకటేశ్వర్లు, మండల టీడీపీ అధ్యక్షులు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, పెమ్మసాని దిలీప్ చౌదరి, రాజశేఖర్‌రాజు, సురేంద్ర, వెంకటేశ్వరరెడ్డి, మస్తాన్ నాయుడు, దయాకర్‌రెడ్డి, శ్రీనివాసు లు నాయుడు, కేపీ రాజు,రమేష్‌బాబు, బట్టా వెంకటేశ్వర్లు, దశయ్యానాయుడు, రమణ,కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 24వ డివిజన్‌లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి గట్టి షాక్



**నెల్లూరు సిటీ,నవంబర్19,ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి షాక్ మీద షాక్ తగులుతుంది. ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డివైపు ఉన్న వారంత ఒక్కొక్కరిగా నమ్మకానికి మారుపేరైన అభివృద్ధి ప్రదాత ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పక్షాన చేరుతున్నారు. ఆదివారం టిడిపికి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రెండు వరుస షాక్‌లు తగిలాయి. 24వ డివిజన్‌కు సంబంధించిన సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఉన్న కత్తి వినోద్ టిడిపి విధానాలు నచ్చక,ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పక్షానఉండలేక ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి పుష్పగుచ్చం అందించి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. తనకు జగన్మోహన్‌రెడ్డి అంటే ఇష్టమని,అదేవిధంగా ఆదాల అన్న అంటే ఇష్టమని అందుకే నేరుగా వైసీపీలోకి రావడం జరిగిందని కత్తి వినోద్ వ్యాఖ్యానించారు. నెల్లూరు ఎంపీ కార్యాలయంలో 24వ డివిజన్ ఇంచార్జీ ఉడతా మురళీ యాదవ్ ఆధ్వర్యంలో కత్తి వినోద్ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని కలిశారు. అనంతరం విజయడైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందించి ఇకనుండి తన సంపూర్ణ మద్దతు ఆదాల అన్నకే ఉంటుందన్నారు. తాను ఎటువంటి ప్రలోభాలకు లోనుకాలేదని జగన్మోహ న్‌రెడ్డి ,ఆదాల అన్నలు అంటే ఇష్టంతోనే వైసీపీలో మనస్ఫూర్తిగా పని చేయాలన్న ఉద్దేశంతోనే రావడం జరిగిందన్నారు. వైసీపీ సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య,క్లస్టర్1 అధ్యక్షులు ముడియాల రామిరెడ్డి ఉన్నారు.

## వివాహ వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే



**కోవూరు, నవంబరు 19 ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం కోవూరులోని కళ్యాణ మండపంలో జరిగిన మూడు వివాహాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కోవూరు సర్పంచ్ వై. విజయ కుమారుడు డాక్టర్ సతీష్ వివాహంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా కేవీఎస్ కళ్యాణ్ మండపంలో వైసీపీ నాయకుడు దండి సురేష్ సోదరుని కుమారుడు వివాహంలో కూడా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, కోవూరు ఏఎంసీ ఛైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, కోవూరు సీఐ డి. వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## గెలుపు ఓటమిల కంటే పోటీల్లో పాల్గొనడమే క్రీడా స్ఫూర్తి



**కోవూరు, నవంబరు 19 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి పోటీలో పాల్గొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఇండియా బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నెల్లూరు చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్మారక ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటమిల కంటే పోటీలో పాల్గొనడమే క్రీడా స్ఫూర్తి అన్నారు. చిన్నారులు, యువత తమ ఆలోచనలను మరింత పదును పెట్టేందుకు చెస్ క్రీడ ఎంతగానో సాధన పడుతుందన్నారు. ఇటువంటి పోటీల వలన విద్యార్థుల్లో దాగి ఉన్న మేదస్సు మరింత మెరుగుపడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై. సుమన్ మాట్లాడుతూ మెట్రో సిటీలకే పరిమితమైన ఈ చెస్ క్రీడను ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా దృష్టి పెట్టామన్నారు. ఈ పోటీలో పాల్గొన్న క్రీడాకారులకు లక్ష రూపాయల వరకు ప్రోత్సాహక నగదు బహుమతులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి డి. శ్రీహరి, కడప జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్, కర్నూల్ జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు వి. సత్యనారాయణ, టోర్నీ డైరెక్టర్ వెంకటేష్, డాక్టర్ మధుసూదన్, ఎన్. విజయకుమార్‌లు పలు సూచనలు చేశారు. అనంతరం విజయ శంకర్‌రెడ్డి , ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ రవితేజలు తొలి ఎత్తులతో పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

## ప్రజలతో మమేకం కావాలి



**నెల్లూరు నవంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రూరల్ నియోజకవర్గంలోని 19వ డివిజనుకు చెందిన రోహిత్‌కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 300మంది యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని గజమాలతో సత్కరించారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వారికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వడ్లమూడి రమేష్, నెల్లూరు మురళినాయుడు, నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి, లీలామోహన్‌రెడ్డి, కాయల మధు, మల్లి, వినయ్‌కుమార్, చంద్రశేఖర్, సల్మాన్‌బాషా, పరమేష్‌రెడ్డి, పృధ్విరెడ్డి, హర్ష, జయశంకర్‌చౌదరి, సుమన్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## గండికోటకు " సాహిత్య జ్యోతి పురస్కారం "



**బుచ్చి నవంబర్ 19ప్రభాతవార్త** తెలుగుభాషా సాహిత్యాన్ని విద్యార్థుల మనస్సుకు హత్తుకునే విధంగా బోధించడమే కాకుండా తెలుగు బాషాభివృద్ధికి విశేషంగాకృషి చేస్తున్న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు జిల్లా రిసోర్స్‌గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్‌కుమార్‌కి సాహిత్య జ్యోతి పురస్కారం ప్రధానం చేశారు. 125 వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం సందర్భంగా విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాజీ విద్యాశాఖా మంత్రి ఎంఎల్‌సి డొక్కా మాణిక్య వరప్రసాద్, రాష్ట్ర సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ పిల్లం గోళ్ళ శ్రీలక్ష్మీ ,శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వేమన,బద్దెవ,నన్నయ్య, ఎర్రన్న,తిక్కన పద్యాలను విద్యార్దులకు ప్రజలకు చేరవేయడంలో గండికోట విశేషంగా కృషి చేస్తున్నారని అభినందించారు. ఈకార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ అద్యక్షురాలు గిడిడ ఈశ్వరి భూషణం, అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక సమన్వయకర్త కొల్లి రమావతి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ మహిళా అద్యక్షురాలు చిట్టే లలితాతదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



**కోవూరు, నవంబరు 19 ప్రభాతవార్త :** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని కోవూరు సీఐ డి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కోవూరులోని నేతాజీనగర్ , లక్ష్మీనారాయణపురం , తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై తనిఖీలు నిర్వహించడం జరగిందన్నారు. ఈ తనిఖీల్లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహన చోదకులు రోడునడ ప్రమాదాలను నివారించేందుకు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రషీద్, సతీష్,పోలీసులు మురళీ,మధు, సునీల్, తదితరులు ఉన్నారు.

## ఇదేమి రాజ్యం...ఇదేమి రాజ్యం...గుంతల రాజ్యం.. దొంగల రాజ్యం



**కావలి, నవంబరు 19 ప్రభాతవార్త** ఇదేమి రాజ్యం...ఇదేమి రాజ్యం...గుంతల రాజ్యం.. దొంగల రాజ్యం అంటూ తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్‌లు దుయ్యబట్టారు. కావలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ రోడ్లపై ఆదివారం గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. నిన్న తుమ్మలపెంట రోడ్డు దుస్థితిని ప్రజలకు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ రోజు ఎంతోమంది పేదలు నివసిస్తున్న ఇందిరమ్మ కాలనీ రోడ్ల బాగోతంపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కనీసం గుంతలు పూడ్చలేని, రోడ్లు వేయలేని సియం జగన్ గద్దెదిగిపోవాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం బుద్ధితెచ్చుకొని రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల బాగోగులు పట్టదా అంటూ ప్రశ్నించారు. రహదారుల్ని నిర్మించలేని దిక్కుమాలిన పరిస్థితులలో ఈ రాష్ట్ర ప్రభుత్వం వుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి నేతలు దోచుకోవడంలో తప్ప అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధి జరగాలంటే రానున్న ఎన్నికలలో తెలుగుదేశం, జనసేనల ఐక్య అభ్యర్థుల్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. వైసిపి పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా వున్నారన్నారు. సియం డౌన్‌డౌన్, ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అన్న నినాదాలతో టిడిపి, జనసేన నాయకులు హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో మాలేపాటి, అళహరి సుధాకర్‌లతో పాటు టిడిపి నేతలు మన్నవ రవిచంద్ర, బొట్లగుంట శ్రీహరినాయుడు, జ్యోతిబాబురావు, గుత్తికొండ కిషోర్‌బాబు, షేక్ మస్తాన్, మండవ వెంకట్రావు, శానం హరి, మంచాల ప్రసాద్, కోట రమేష్, దావులూరి దేవకుమార్ మాదిగ, అక్కిలిగుంట సూర్యప్రకాష్ మాదిగ, భవాని, జనసేన పార్టీ నేతలు ఆలా శ్రీనాథ్, మహేంద్ర, నాగార్జున, గుడిపల్లి వెంకయ్య, బెల్లంకొండ మస్తాన్, తిరుమలశెట్టి సుధీర్, గుంటుపల్లి కృష్ణయ్య, జాని, రాజా, మల్లికార్జున, ఆది, శరణ్, షమ్మి,వినయ్, ధనుష్,ఇమ్రాన్, జఫుల్లా, రామ్‌తేజ, టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంకు అధికారం ఖాయం



**కందుకూరు నవంబరు 19,ప్రభాతవార్త** రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కందుకూరు తెదేపా ఇన్‌చార్జీ ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కందుకూరు పట్టణంలోని 15వవార్డు ఖాజీపాలెం, ముళ్లపాలెం, ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని తెదేపా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతూ జగన్ పాలనలో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రంజాన్ తోఫా, విదేశీ విద్య, దుకాన్‌మకాన్,దుల్హన్ తదితర పథకాలను ఎందుకు నిలుపుదల చేశారని ప్రశ్నించారు. అరకొర సంక్షేమ పథకాలు అమలుచేయడం తప్ప గత నాలుగేళ్లలో ఏంచేశారని ఆయన మండి పడ్డారు. టీడీపీ మేనిపేస్టోలో ఏయే పథకాల ద్వారా కుటుంబానికి ఎంత మొత్తం నగదు జమ చేస్తారో వివరిస్తూ, ష్యూరిటీ బాండ్లను స్థానికులకు అందచేశారు. రానున్నది తెదేపా ప్రభుత్వమేనని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కందుకూరులో అధిక జనాబా ఉన్న ముస్లింలకు మేలు చేసింది తెదేపానేని అన్నారు. టీడీపీ హయాంలోనే షాదీఖానా నిర్మాణానికి స్థలం కేటాయిస్తే ఇప్పటివరకు ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆక్షేపించారు. స్థానిక ఎమ్మెల్యే ముస్లింలకు ప్రతీసారి మాయమాటలు చెప్పి ఓట్లేయించుకొని, ఆతర్వాత వారిని పట్టించుకోవడంలేదన్నారు. ఈ మోసాన్ని గ్రహించిన ముస్లింలు ఇపుడిప్పుడే వాస్తవాలను గుర్తించి టీడీపీ వైపు నడుస్తున్నారని అన్నారు. అయితే వీరినిఎమ్మెల్యే అనుచరులు బెదిరిస్తున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అయితే అలాంటి బెదిరింపులకు భయపడవద్దని, తాను మీ బిడ్డగా అండగా ఉంటానని నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. కందుకూరులో తన గెలుపుకు సహకరించాలని ఆయన ముస్లింలకు విజ్ఞప్తిచేశారు. నియోజకవర్గ పరిశీలకురాలు కుసుమకుమారి మాట్లాడుతూ చంద్రబాబు హయాంలోనే ముస్లింలకు అన్ని అవకాశాలు కల్పించారన్నారు. శాసనమండలి ఛైర్మన్ పదవిని ఎంఏ షరీఫ్‌కి అవకాశం కల్పించి ములసల్లింలను గైరవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వ రరావు, ప్రధ్రూణఖ్రూత్‌ధఙఙదర్శి ముచ్చు శ్రీను,నాయకులు ఖలీల్, సలాం, అబ్దుల్లా అమీరుల్లా,హాజీబాషా, జిలాని,నజీర్ చిలకపాటి మధు, రవిచంద్ర, రూబీ, జియాఉద్దీన్, కరీముల్లా, లింగాబత్తిన మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇంధిరాగాంధీ జయంతి వేడుకలు



**సీతారామపురం నవంబర్ 19 ప్రభాతవార్త** భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్‌పార్టీ ఆద్వర్యంలో మండలంలోని బసినేనిపల్లి గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ ఉదయగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి దుద్దుకూరి రమేష్‌నాయుడు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌నాయుడు మాట్లాడుతు భారతదేశానికి తొలి ప్రధానిగా మూడు పర్యాయాలు ఎన్నిక కావడం జరిగిందని బ్యాంకులను జాతీయం చేయడం పేదలకు కూడ,గుడ్డ,గూడు, కల్పించిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందని అన్నారు. భారతదేశంలో అభివృద్ధి ఇందిరాగాంధీ హయాంలోనే ప్రారంభం అయిందని అన్నారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మెదక్ నుండి ఎంపిగా పోటీ చేసి భారీ మెజార్టీతో గెలిచి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరచిందని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ఆమె మనవడు రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కాబోతున్నారని జోస్యం చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో గెలిచి కాంగ్రెస్‌పార్టీ కర్నాటక పలితాలను పునరావృతం చేస్తుందని అన్నారు. ప్రతి రైతు కుటుంబానికి 5 లక్షల రూపాయాలు ఇచ్చి 2 లక్షల మేర రుణమాఫీ చేస్తుందని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే సీతారామపురం మండలంలోని ఘటిక సిద్దేశ్వరం ఆలయానికి రహదారి నిర్మాణ పనులకు అటవీ శాఖ నుండి అనుమతులు తీసుకొని వచ్చి రహదారిని ఏర్పాటు చేస్తామన్నారు ఉదయగిరి మాజీ ఎంపిపి బాలయ్య, సీతారామపురం కాంగ్రెస్‌పార్టీ అద్యక్షులు కానాల హజరత్తయ్య, సీనియర్‌నాయకుడు కానాల ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ నూతన కార్యవర్గం



**వింజమూరు,నవంబర్19,ప్రభాతవార్త** :వింజమూరు బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి రాష్ట్ర, జిల్లాస్థాయి యుటిఎఫ్‌ముఖ్య నేతలు హాజరయ్యారు. అనంతరం యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా పరమేశ్వర్‌రావ్ , ప్రధాన కార్యదర్శిగా ఎం.వీరాంజనేయులు, కోశాధికారి గా ఎస్.కె.మీరావలి, అసోసియేటెడ్ అధ్యక్షులు వి.వసంతకుమారి, సి.హెచ్.నర్సింహారావ్, జిల్లా కౌన్సిలర్స్ జి.చెంచలబాబు, కె.రామయ్య, ఎం.కోటేశ్వరరావ్, మీడియా కన్వీనర్ డి.పి.నర్సింహులు , కుటుంబ సంక్షేమ కన్వీనర్ కె.శివకుమార్, మహిళాకన్వీనర్ విజయకుమారిలను ఎంపిక చేశారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ పరిణామాలపై చర్చించారు. ఆర్థిక నివేదికలతో చర్చ ఆమోద కార్యక్రమాలను చేపట్టారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా , రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.